శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## 13న కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం రద్దు

**నెల్లూరు అర్బన్,నవంబర్9,ప్రభాతవార్త** దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 13వ తేదీ ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించి నందున సోమవారం జిల్లాలో జగనన్నకు చెబుదాం జరగదని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 20న జగనన్నకు చెబుదాం యధావిధిగా జరుగుతుంది ఆయన తెలిపారు.

## ఓటరు ప్రత్యేక కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహించండి




**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్9,ప్రభాతవార్త** నెల్లూరు నగరపాలక సంస్థ సిటి నియోజకవర్గ పరిధిలోని 248పోలింగ్ కేంద్రాలతో పాటు మాల్స్,ఆర్‌టిసి బస్టాండ్,ఎంజి షాపింగ్‌మాల్,షాపింగ్ కాంప్లెక్స్‌లు వంటి వివిధ ప్రత్యేక కేంద్రాలలో ఈ నెల 8.11.23 నుండి 08.12.23 వరకు నెల రోజుల పాటు ఏర్పాటు చేస్తున్న ఓటరు నమోదు ప్రత్యేక కేంద్రాలను ఎన్నికల సిబ్బంది సమర్ధవంతంగా నిర్వహించి,ప్రతి ఒక్క ఓటరూ జాబితాలో పేరు నమోదు చేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ వికాస్‌మర్మత్ సూచించారు.ఈ ఏడాది అక్టోబర్ నెలలో ప్రచురించిన తుది ఓటర్ డ్రాఫ్ట్ రోల్ ముసాయిదా జాబితాలో నూతనంగా సవరణలు,అభ్యంతరాలు,ఫారం 6,7,8 ధరఖాస్తులను బి.ఎల్,ఓలు క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు నమోదు చేసుకునేలా ఎన్నికల విభాగం ప్రచారం కల్పించాలని కోరారు.ఓటరు ప్రత్యేక కేంద్రాలలో బూత్‌లెవల్ అధికారుల అందుబాటులో ఉంటారని,ఓటర్లంతా జాబితాలో ఓట్లను సరిచూసుకోవాలని సూచించారు.అదేవిధంగా ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఫారం 6,7,8 దరఖాస్తులను ఓటర్లు అందజేయాలని కమిషనర్ ఆకాంక్షించారు.ఓటర్ల జాబితాలో సవరణలు,అభ్యంతరాలు,మార్పు చేర్పులకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలను అర్హులైన ఓటర్లు వినియోగించుకుని పూర్తిస్థాయి ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలని కమిషనర్ కోరారు.

## సచివాలయాలు తనిఖీ చేసిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్9,ప్రభాతవార్త** నెల్లూర నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక 10/4,నాగలపట్ల స్ట్రీట్,14/1,14/2,14/3 బాలాజీనగర్ ప్రాంతంలోని వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్‌మర్మత్ గురువారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సచివాలయాల్లోని ఇన్స్ట్రక్షన్ రిజిష్టరు,నోటీసుబోర్డు,హాజరు రిజిస్టరు,స్పందన రిజిష్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు.సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని,సాంకేతిక అంశాలపై కార్యాలయం నుండి నేరుగా సూచనలు,సలహాలు పొందాలని సచివాలయాల కార్యదర్శులకు కమిషనర్ సూచించారు.ఎస్.డి.జి సర్వే,భూహక్కు,సర్వే ,ఎ.పి.సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సూచించిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని తెలిపారు.స్పందన,జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు,నాడు-నేడు పనుల పురోగతి,ఆస్థిపన్ను,యూజర్ చార్జీల వసూళ్ళ ను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని సూచించారు.ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని,తమకు నిర్ధేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులోపు అందుకోవాలని సూచించారు.జగన్న కాలనీలేఅవుట్ల నిర్మాణ పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అమెనిటీస్ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కర్తం,ప్రతాప్‌రెడ్డి,నరగపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## దేవరకొండ నివాసంలో పోలీస్ బలగాల తనిఖీలు

**కావలి, నవంబరు 9 ప్రభాతవార్త** ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు దేవరకొండ సుధీర్ నివాసంలో పోలీస్ బలగాలు తనిఖీ తంతు నిర్వహించాయి. కావలి పట్టణంలోని తుఫాన్‌నగర్‌లోని దేవరకొండ సుధీర్ నివాసంలో గురువారం వివిధ వాహనాలలో పోలీస్ బలగాలు తరలివచ్చి తనిఖీలు చేపట్టారు. నెల్లూరు నుంచి బెటాలియన్‌తో దాదాపు వంద మంది పోలీసులు సుధీర్ నివాసాన్ని చుట్టుముట్టి తనిఖీలు నిర్వహించారు. ఒక్కసారిగా పోలీస్ వాహనాలు ఆ ప్రాంతానికి రావడంతో కావలిలో చర్చనీయాంశమైంది.

## జగనన్న ఆరోగ్య సురక్ష సూపర్ సక్సెస్



**నెల్లూరు అర్బన్,నవంబర్9,ప్రభాతవార్త** రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతమైనట్లు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 30వ తేదీ నుండి ప్రారంభమై నవంబర్ 8వ తేదీ వరకువ జరిగిన జిల్లా వ్యాప్తంగా అర్బన్ పరిధిలో 166,రూరల్ పరిధిలో 497,మొత్తం 663 ఆరోగ్య సురక్ష శిభిరాలు నిర్వహించి,2,44,866మందికి వైద్య సేవలు అందించామని కలెక్టర్ తెలిపారు.కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 59,362మందికి కంటి పరీక్షలు చేయుంచుకోగా 6722మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారన్నారు.91,974మందికి ర్త పరీక్షలు నిర్వహించగా 14,586మందికి బీపీ, 9348 మందికి మధుమేహం ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు చెప్పారు.4920మందికి చిన్నచిన్న శస్త్ర చికిత్సలు,మెరుగైన వైద్య సేవలు అవసరమని గుర్తించి ఆరోగ్యశ్రీ నెట్వర్క్ అసుపత్రులకు వైద్యులు సిఫారసు చేసినట్లు కలెక్టర్ చెప్పారు.జిల్లాలో సెప్టెంబర్ 30నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో ఇద్దరు స్పెషలిస్టులు,ఇద్దరు పిహెచ్‌డిలతోపాటు వైద్యులతో పాటు ఆరోగ్యశ్రీ నెట్వర్క్ ఆసుపత్రుల నుండి ఒక స్పెషలిస్టు వైద్యులు హాజరై ప్రజలకు వైద్య సేవలు అందించారన్నారు.ఒక్కొక్క శిబిరానికి సరాసరిన 400పైగా ప్రజలు హాజరై వైద్యసేవలు పొందినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు విజయవంతంగా నిర్వహించినందుకు స్పెషలిస్ట్ డాక్టర్లకు,వైద్యఆరోగ్యశాఖ అధికారులకు,సిబ్బందికి,మండల గ్రామస్థాయి అధికారులకు,ప్రజా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

## విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



**అనుమసముద్రంపేట,నవంబర్9,ప్రభాతవార్త :** ఏఎస్‌పేటలోని జల్లివారి వీధిలో గురువారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై షేక్ మస్తాన్(48) మృతిచెందాడు. ఈసంఘటనకు సంబంధించి పోలీస్‌ల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మస్తాన్ స్థానికంగా చిన్న చిన్న కూలినాలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. దానిలో భాగంగానే ఒక ప్రవేటు ఇంటిలో కూలి పనులకు వెళ్ళిన మస్తాన్ పక్కనే ఉన్న 11కెవి విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే చనిపోయారు. పొట్టకూటికోసం కూలికి వెళ్ళి విద్యుత్ షాక్‌కు గురై మస్తాన్ మృతిచెందినట్లు స్థానికులను కలిచివేసింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకన్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టంకై ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

## బాల్యవివాహాల నిర్మూలన పై అవగాహనా సదస్సు



**ఆత్మకూరు,నవంబర్9,ప్రభాతవార్త :** ఆత్మకూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని గ్రెడ్ స్వచ్ఛంద సంస్థ వాలంటరీగా నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఆత్మకూరు ఆర్‌డిఓ మధులత ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 18సంవత్సరాల లోపు ఉన్న యువతులు, 21సంవత్సరాల లోపు ఉన్న యువకులు పెళ్ళిళ్ళు చేసుకోవడం చట్టరీత్యానేరమన్నారు. ఎవరైనా తల్లిదండ్రులు ప్రోత స్రహించి పెళ్ళిళ్ళు చేస్తే వారు చట్టరీత్యా శిక్షార్హులన్నారు. దీనికి రెండుసంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధిస్తారన్నారు. ఇలాంటి బాల్యవివాహాలను ప్రోత్సహించే వారికికూడా శిక్షపడుతుందన్నారు. ఈకార్యక్రమాన్ని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిర్వహిస్తున్న స్వచ్ఛందసంస్థల ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అన్ని మండలాల్లో పాఠశాల విద్యార్థులకు ఈకార్యక్రమాన్ని వారం రోజులపాటు నిర్వహిస్తారన్నారు.

## నేడు సైదాపురంలో జగనన్నకు చెబుదాం

**నెల్లూరు అర్బన్,నవంబర్9,ప్రభాతవార్త** శుక్రవారం సైదాపురంలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు.శుక్రవారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1:30గంటల వరకు సైదాపురం మండల పరిషత్ ఆవరణలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం నిర్వహిస్తున్నదని,సైదాపురం మండలంలోని గ్రామాల ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# దళితుల్ని అవమానపరిచిన చంద్రబాబుని వ్యతిరేకించాలి







**కావలి, నవంబరు 9 ప్రభాతవార్త** ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీల అభ్యున్నతికి గండికొట్టి అవమానపర్చిన చంద్రబాబునాయుడుని రానున్న ఎన్నికలలో వ్యతిరేకించాలని మత్స్యకార, పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన, వైసిపి రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి సారధ్యంలో కావలి పట్టణ జాతీయ రహదారిపై బిసిఎస్ సెంటర్‌లో గురువారం సాయంత్రం 'సామాజిక సాధికార యాత్ర' బహిరంగ సభ అశేష జనవాహిని మధ్య జరిగింది. ఈ సభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. కావలిలో ఒక్క జగన్మోహన్‌రెడ్డి బొమ్మ పెట్టుకుంటేనే జనం నీరాజనం పలికారన్నారు. ఇక జగనన్న పాల్గొంటే జన ప్రభంజనమే అవుతుందన్నారు. రామోజీరావు, రాధాకృష్ణ, సాంబలు సభ అయిన తర్వాత జనం వెళ్లిన అనంతరం ఖాళీ కుర్చీల ఫోటోలు పెట్టడం వారికి అలవాటైందని దుయ్యబట్టారు. వీరు ముగ్గురు కావలికి వచ్చి చూస్తే జననీరాజనం ఏమిటో తెలుస్తుందని హెచ్చరికలు చేశారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలు పెత్తనం చేశాయన్నారు. ఈ కమిటీలు ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీల్ని తిప్పుకొని అభ్యున్నతికి గండికొట్టారని దుయ్యబట్టారు. చంద్రబాబు పాలనలో కుల పిచ్చి సాగిందన్నారు. ఇటువంటి తరుణంలో జగనన్న నాలుగున్నరేళ్ళ పాలనలో విద్య, వైద్యానికి పెద్దపీట వేశారన్నారు. పిల్లలకు అన్ని రకాల యూనిఫామ్ సౌకర్యం కల్పించారన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారన్నారు. దళారి వ్యవస్థని రూపుమాపి జగనన్న సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా అర్హుల ముంగిళ్ళలోకి చేరేలా సచివాలయ వ్యవస్థ పనిచేసిందన్నారు.ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీల అభ్యున్నతికి నిజమైన సామాజిక సాధికారతను కల్పించారన్నారు. అందువల్ల అందరం ఒకేతాటిపై నిలబడి రానున్న ఎన్నికలలో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుని మన ఆత్మగౌరవాన్ని కాపాడుకుందామన్నారు. ఈ రాష్ట్రంలో 980 కిలోమీటర్లు తీర ప్రాంతం వుందన్నారు. 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా మూడు సార్లు పనిచేసిన చంద్రబాబు ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఒక హార్బర్‌కు, పోర్టుకు శంఖుస్థాపన చేయలేదన్నారు.ఈ నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో 10 హార్బర్లు, నాలుగు పోర్టులకు శంఖుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. ఆదాయానికి వనరులైన తీర ప్రాంత అభివృద్ధికి జగనన్న పెద్దపీట వేశారన్నారు. వీటి వల్ల ఉపాధి, ఉద్యోగకాశాలు కలుగుతాయన్నారు. అందుచేత చంద్రబాబు మోసపు మాటలు నమ్మకుండా జగనన్నకు మళ్లీ పట్టం కడదామన్నారు. ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను మంచి మెజర్టీతో గెలిపించాలని కోరారు. ఈ సభలో వైసిపి జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మన దేశంలోనే జగనన్న లాంటి ముఖ్యమంత్రి లేరన్నారు. ఎస్సీ,ఎస్టీ,బిసి, మైనార్టీల అభ్యున్నతికి సియం జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తూ అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేశారన్నారు. రానున్న ఎన్నికలలో అందరం పట్టుదలగా పనిచేసి జగన్‌ను మళ్లీ సియంగా చేసుకుందామన్నారు. ఎంపిగా తనను, ఎమ్మెల్యేగా ప్రతాప్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ సభలో రాజ్యసభ సభ్యులు, కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ భారతదేశంలో సామాజిక న్యాయం కల్పించడంలో రోల్ మోడల్‌గా జగన్మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి చొరవతో తనకు వైసిపిలో రాజకీయ అవకాశం కలిగిందన్నారు. బిసిలకు పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. తాను టిడిపిలో కొనసాగిన సమయంలో రాజ్యసభకు మూడుసార్లు చంద్రబాబు తనకు హామీ ఇచ్చి మూడు పంగనామాలు పెట్టారని విమర్శించారు. దీంతో విజయసాయిరెడ్డి పుణ్యమా అంటూ వైసిపిలో సియం జగన్ తనను రాజ్యసభ సభ్యుడుగా నియమించారన్నారు. బిసిలకు చట్టసభలలో ప్రాధాన్యత కల్పించేలా సియం జగన్ అన్ని చర్యలు చేపడుతున్నారన్నారు. కేబినెట్‌లో 25 మంది మంత్రులు వుంటే 17 మంది ఎస్సీ,ఎస్టీ, బిసి,మైనార్టీలకు చెందిన వారు వుండటం జగనన్న సామాజిక సాధికారతను చాటిచెప్పారన్నారు. పేదల్ని అన్ని రకాలుగా ఆదుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికలలో చంద్రబాబునాయుడుని నమ్మవద్దని బీద పిలుపునిచ్చారు. ఎంపిగా ప్రభాకర్‌రెడ్డిని, హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ప్రతాప్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల వారిని అక్కున చేర్చుకుని ఆదుకున్న ఘనత సియం జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని కల్పించిన ఘనత జగనన్నదేనన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాల ఫలాలు అందించడం జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పెట్టుకుని పనిచేస్తున్నారన్నారు. కావలిని కనకపట్నం చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టు వల్ల ఎంతో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఫిషింగ్ హార్బర్‌ను త్వరలో సియం చేత ప్రారంభం చేయిస్తామన్నారు.ఎయిర్‌పోర్టును కూడా ఏర్పాటు చేసి ఇండ్రస్ట్రియల్‌గా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఎంపిగా ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ సభలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, వైసిపి రాష్ట్ర నేత జూపూడి ప్రభాకర్, పోతుల సునీతలు మాట్లాడారు. ఈ సభలో జెడ్పీ చైర్మన్ అరుణమ్మ, ఎయంసి చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, వైసిపి నేతలు పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, షాహుల్ హమీద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేదపండితులు, ముస్లింలు, క్రిస్టియన్లు ఆశీర్వచనాలు అందజేశారు.

## డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోండి



**నెల్లూరు అర్బన్,నవంబర్9,ప్రభాతవార్త** గురువారం కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో జిల్లా హరినారాయణన్ వైద్య శాఖ,ఆరోగ్య శాఖ,విద్యాశాఖ,స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమావేశమై సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా జిల్లాలో అమలు జరుగుతున్న కార్యక్రమాల పురోగతిని సమీక్షించి తగు సూచనలు,సలహాలు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ,విద్యాశాఖ,స్త్రీ శిశు సంక్షేమ శాఖల ద్వారా క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న కార్యక్రమాల పురోగతిపై ప్రతివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షించడం జరుగుతుందన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా ప్రాధాన్యత ఇండికేటర్స్ లక్ష్య సాధనకు సంబంధిత జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా 10-19 వయస్సు కలిగిన పిల్లలకు,15-49 వయస్సు గల గర్భిణులకు ప్రతి నెల వైద్య పరీక్షలు జరపాలని,అలాగే గుర్తించిన రక్తహీనత వారికి ఐరన్ మాత్రలు,అదనపు పౌష్టిక ఆహారం తప్పనిసరి అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.ఎత్తు,బరువు తక్కువ ఉన్న 5సంవత్సరాలోపు పిల్లలను గుర్తించి వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టిక ఆహారం అందేలా చర్యలు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.జిల్లాలో అమలు జరుగుతున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా ఎప్పటికప్పుడు డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవడంతోపాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను రూపొందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి గంగా భవాని,ఐసీడీఎస్ పిడి హేనసుజన,సిపిఓ రాజు,సమగ్ర శిక్ష ఎపిఇస ఉషారాణి,ఇంచార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాధర్‌వలి,డిసిహెచ్‌ఎస్ డా.రమేష్‌నాథ్,ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## క్లీన్ అండ్ గ్రీన్‌గా దీపావళి జరుపుకుని ఆదర్శంగా నిలుద్దాం




**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్9,ప్రభాతవార్త** దీపావళి పండుగను పురస్కరించుకుని నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పర్యావరణ అనుకూలమైన స్థానిక ఉత్పత్తులనే వినియోగించి క్లీన్ అండ్ గ్రీన్ ప్రచారంలో ఆదర్శంగా నిలుద్దామని మేయర్ స్రవంతిజయవర్ధన్,కమిషనర్ వికాస్ మర్మత్‌లు ఆకాంక్షించారు.దీపావళి పండుగ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్,ఐడెంటిటి కార్డులు,చెప్పులు,కొబ్బరి నూనె,సబ్బులు,చీరలను కార్యాలయంలోని డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో మేయర్ చేతులమీదుగా గురువారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మేయర్ స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. ప్రజలంతా పర్యావరణానికి హాని చేసే బాణాసంచా ఉత్పత్తుల వినియోగం తగ్గించి,కాలుష్య నివారణకు దోహదపడాలని కోరారు.నగరపాలక సంస్థ విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని,విధి నిర్వహణలో వారికి రక్షణ ఉపకరణ్యాలు అందించడం కార్పొరేషన్ ప్రధాన బాధ్యత అని తెలియజేశారు.ఈ సందర్భంగా కార్మికులతో కాలుష్య రహిత దీపావళి ప్రతిజ్ఞ చేయించి,ప్రజలందరికీ అవగాహన కల్పించమని వారికి సూచించారు.అనంతరం కమిషనర్ మాట్లాడుతూ కార్మికులకు ఎవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకునివచ్చి పరిష్కారాలు పొందాలని సూచించారు.విధుల నిర్వహణలో కార్మికులు క్రమశిక్షణను పాటించి,అందజేసిన రక్షణ ఉపకరణాలను పని ప్రదేశాల్లో క్రమం తప్పకుండా వినియోగించాలని ఆదేశించారు.క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ వందశాతం నగరపాలక సంస్థ పరిధిలో అమలు చేసేందుకు కృషి చేయాలని కమిషనర్ సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, ఆరోగ్యశాఖాధికారి డా.వెంకటరమణ,ఇంజనీరింగ్ విభాగం యస్‌ఈ సంపత్‌కుమార్,ఈఈ సంజయ్,టిపిఆర్‌ఓ ప్రసాద్,శానిటేషన్ సూపర్‌వైజర్లు,ఇంజనీరింగ్,హెల్త్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాదరణ చూసి ఓర్వలేకే చంద్రబాబుపై అక్రమ కేసులు



**నెల్లూరు నవంబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ, చంద్రబాబుపై పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే, జగన్‌మోహన్‌రెడ్డి చంద్రబాబుపై అక్రమ కేసులు పెడుతున్నాడని తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి పొంగూరు నారాయణ, జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు విమర్శించారు. గురువారం నగరంలోని 34వ డివిజను పరిధిలోని కోటమిట్ట, షాదీ మంజిల్ తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో నారాయణ, అబ్దుల్‌అజీజ్, శ్రీనివాసులురెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలకి అపూర్వ స్పందన వస్తోందన్నారు. త్వరలోనే మా నాయకుడు చంద్రబాబునాయుడు నిజాయితీగా బయటకు వస్తారన్నారు. 2024లో ఆయన ప్రజల సమస్యల తీర్చేందుకు తనదైన శైలిలో విజృంభించనున్నారన్నారు. వైసీపీ పాలనలో ఎవరూ సంతోషంగా లేరన్నారు. నగరాన్ని 95శాతం అభివృద్ధి చేసింది తామేనని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## వైద్యశాఖలో పోస్టుల భర్తీకి చర్యలు

**నెల్లూరు నవంబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** దర్గామిట్టలో ఉన్న సర్వజన ప్రభుత్వ పెద్దాసుపత్రి ప్రాంగణంలోని అర్లీఇంటర్‌వెన్షస్ సెంటర్ (బాల భవిత కేంద్రం)లో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం పెంచలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్, ఆడియాలజిస్ట్ కం స్పీచ్‌థెరపిస్ట్, డెంటల్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ చేయనున్నట్టు వెల్లడించార. అర్హులైన అభ్యర్థులు ఈనెల 10వ తేదీ నుండి 14వ తేదీ లోపు తమ ధరఖాస్తులను అందచేయాలన్నారు.
ధరఖాస్తు ఫీజు, అప్లికేషన్ తదితర వివరాలకు ఎస్పీఎస్‌ఆర్‌నెల్లూరు. ఏపీ.జీవోవి.ఇన్/నోటీసు, రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని కోరారు.

## సంక్షేమానికి నిర్వచనం జగనన్న ప్రభుత్వం



**సీతారామపురం నవంబర్ 9 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో ప్రతి ఇంటి సంక్షేమ వెలుగులు కనిపిస్తున్నాయని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ సిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సీతారామపురం బిట్-1 పరిధిలో గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు.గడగడపకు వెళ్ళి సంక్షేమపథకాలు వివరించి బుక్‌లేట్‌లు లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వ పనితీరు సంక్షేమపథకాలు అమలు ప్రజా సమస్యలపై ఆరా తీశారు.అనంతరం ఆయన మాట్లాడుతు గత ప్రభుత్వ ప్రస్తుత ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని గతంలో టిడిపి జన్మభూమి కమీటిలను ప్రసన్నం చేసుకుంటేనే సంక్షేమపథకాలు అందేవని గుర్తు చేస్తు, ప్రస్తుత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థద్వారా అర్హులందరికి పారదర్శకంగా సంక్షేమపథకాలు అందజేస్తుందని తెలిపారు. చంద్రబాబు మాదిరిగా ఎన్నికల ముందు ఇచ్చిన మ్యానిపెస్టును చెత్తబుట్టలో పడవేయకుండా మ్యానిపెస్టులోని హామిలను 98 శాతానికి పైగా వైసిపి ప్రభుత్వం నెరవేర్చిందని అన్నారు. విద్యతోను రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని నమ్మి విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు.గత ప్రభుత్వంలో ప్రభుత్వ రంగంలోని పరిశ్రమలు నష్టాలలో ఉన్నాయని తమ ఎల్లో మీడియాలో పేక్ వార్తలు వ్రాయించి వాటిని ప్రజలు నమ్మేరనే అభిప్రాయానికి రాగానే తన తాబేదారులకు కారు చౌకగా కట్టబెట్టిన దౌర్భాగ్యపు చరిత్ర చంద్రబాబుదని విమర్శించారు. రాబోయే 2024 ఎన్నికలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో సారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని తెలిపారు.ఈకార్యక్రమంలో ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి, జడ్‌పిటిసి చెరుకుపల్లి రమణారెడ్డి, మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి,వైస్ ఎంపిపి బసిరెడ్డి కృష్ణారెడ్డి,అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్‌యాదవ్, తదితరనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆద్వర్యంలో ఉచిత వైద్యసేవలు



సీతారామపురం నవంబర్ 9 ప్రభాతవార్త ఉదయగిరి నియోజకవర్గ టిడిపినాయకులు కాకర్ల సురేష్ ఏర్పాటు చేసిన కాకర్ల చారిటబుల్‌ట్రస్టు ఆద్వర్యంలో నియోజకవర్గంలోని పేద ప్రజలకోసం ఎన్‌టిఆర్ సంజీవిని ఆరోగ్యరథం ద్వారా ఉచిత వైద్యసేవలు ఉచిత మందుల పంపీణి చేస్తున్న విషయం విదితమే అందులో భాగంగా 170 రోజు అయిన గురువారం సంజీవిని ఆరోగ్య రథం ద్వారా సీతారామపురం మండలంలోని చిన్న నాగంపల్లి పంచాయితీ కార్యాలయం వద్ద అనారోగ్య సమస్యలు ఉన్న గ్రామస్తులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు పంపీణితో కూడిని వైద్యసేవలు అందించడం జరిగింది.120 మంది గ్రామస్తులకు డాక్టర్లు వివిధ ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. 85 మంది కంటి చూపు సమస్యలకు పరిక్షలు నిర్వహించారు. మొత్తం 205 మంది చికిత్స తీసుకున్నారు.వీరందరికి ఉచితంగా మందులు పంపీణి చేశారు ట్రస్టు కోఆర్డినేటర్ సుమన్,ట్రస్టు సభ్యులు తిరుపతయ్య,బుజ్జి,రఘురాముడు,గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ



**సైదాపురం, నవంబర్ 9, ప్రభాతవార్త** ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియపరిచే విధంగా మండల కేంద్రమైన సైదాపురంలో ఉన్న సచివాలయం-1 కార్యాలయంలో సంక్షేమ పథకాల బోర్డు గురువారం అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ వెందోటి శారదమ్మ, ఉపసర్పంచ్ బొలిగర్ల శివకుమార్, ఎంపీటీసీ సభ్యులు, గృహసారథులు, వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో దారుణంగా ఉన్న రహదారులు



సైదాపురం, నవంబర్ 9, ప్రభాతవార్త రాష్ట్రంలో ఎక్కడ చూసిన రహదారులు దారుణంగా ఉన్నాయని,ఈ రోడ్లపై ప్రయాణికులు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొందని జనసేన పార్టీ వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరు వెంకటేశ్వర్లు తెలిపారు. సైదాపురం-దేగపూడి రోడ్డు ఉన్న దుస్థితిపై మండల కేంద్రమైన సైదాపురంలో జనసేన ఆధ్వర్యంలో గురువారం గుంతలమయంగా ఉన్న రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైదాపురం-దేగపూడి రహదారి గుంతలమయంగా మారిందని,ఈ మార్గంలో వెళ్లాలంటే ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ధ్వంసమైన రోడ్లు వెంటనే నిర్మాణం చేపట్టాలని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తోనే సాధ్యమని వారు తెలిపారు. జనసేన మండల అధ్యక్షులు పవన్‌కళ్యాణ్, నాయకులు పూసల లక్ష్మీమల్లేశ్వరరావు, తాండ్ర శ్రీను, మగ్గం నవీన్‌కుమార్, పూరాకు శ్రీనివాసులు, బాల మునేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లోరోసిస్ నివారణ పై అవగాహన



దుత్తలూరు,నవంబర్ 9,ప్రభాతవార్త : ఫ్లోరోసిస్ కు సకాలంలో చికిత్స తీసుకోకపోతే ఎముకలకు సంబందించిన వ్యాధులు వస్తాయనీ,కాబట్టి సత్వర చికిత్స చేయించుకోవాలనీ జిల్లా ఫ్లోరోసిస్ నివారణ అధికారిణి డాక్టర్ దివ్య అన్నారు.గురువారం దుత్తలూరు మండల పరిధిలోని నందిపాడు హెల్త్ నెస్ సెంటర్ ను,దుత్తలూరు ఎస్టీ కాలనీ ను సందర్శించారు.ఈ సందర్భంగా ఫ్లోరోసిస్ నివారణపై అవగాహన కల్పించా రు.బొటికర్లపాడు ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థిని,విద్యార్దులకు ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహించారు.ఆరు మంది విద్యార్దుల్లో ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలు ఉండడంతో వారి తగిన సలహాలు సూచనలు అందజేశారు.విటమిన్ సి మొక్క ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమములో దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు ఎస్‌డిఆయూబ్ అప్సర్,వనజ,సూపర్‌వైజర్ ఖాజా మొహిద్దిన్,హెల్త్ అసిస్టెంట్ లు బి.నారాయణ,అస్మదుల్లా,ఏఎన్ఎం లు పార్వతి ప్రశాంతి,మాధవి ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు జగనన్నకు చెబుదాం కార్యక్రమం

**సైదాపురం, నవంబర్ 9, ప్రభాతవార్త** మండల కేంద్రమైన సైదాపురంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆయన తెలియజేశారు.

## సంక్షేమ పథకాలతో పేద ప్రజల అభివృద్ధికి తోడ్పాటు



**వరికుంటపాడు,నవంబర్ 9,ప్రభాతవార్త :** సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు ఆర్థికంగా చేయుతనిస్తూ,తోడ్పాటునందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కే దక్కుతుందనీ ఉదయగిరి మాజీ ఎఎంసి చైర్మన్ షేక్ అలీ అహ్మద్ అన్నారు.వరికుంటపాడు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్ జగన్ కార్యాక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమములో భాగంగా సంక్షేమ పథకాలకు చెందిన బోర్డును ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ,వైకాపా మండల కన్వీనర్ మందలపు తిరుపతి నాయుడు,సర్పంచ్ కొండెపోగు దిలీప్ కుమార్ ,మండల జెసిఎస్ కన్వీనర్ బొడ్డు వెంకటేశ్వర్లు రెడ్డి,వైకాపా జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాగంటి శ్రీనివాసులు ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ జగనన్న ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామి ని నెరవేర్చి,పేద ప్రజలకు అండగా నిలిచారన్నారు.వరికుంటపాడు సచివాలయ పరిధిలో సుమారు 20 కోట్ల రూపాయలకు పైగా అభివృద్ధి పనులు చేశామన్నారు.విద్యా, వైద్యం,వ్యవసాయం కు పెద్ద పీట వేసి పాలనలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు.ప్రతి ఇంటి లో విద్య ద్వారానే వెలుగులు నిండాలనే ముఖ్య ఉద్దేశంతో అమ్మవడి,జగనన్న విద్యాకానుక వంటి పథకాలతో పాటు నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కే దక్కుతుందనీ ప్రశంసల జల్లు కురిపించారు.ఈ కార్యక్రమములో భాగంగా బస్‌స్టాండ్ సెంటర్ వైకాపా జెండా ను ఎగురవేశారు.ఈ కార్యక్రమములో సొసైటి అధ్యక్షుడు గుంటుపల్లి రామాంజనేయులు,ఎంపిడిఓ చేవూరి శ్రీదేవి,మాజీ ఎఎంసి డైరెక్టర్ దాసరి యర్రా ఓబయ్య,నేతలు పోలుబోయిన మల్లికార్జున యాదవ్, రేగలగడ్డ బంగారుబాబు,గవదకట్ల మల్లికార్జున,సర్పంచ్ లు కుమ్మిత ప్రతాప్ రెడ్డి,ఎర్రమల ప్రభాకర్ ,ఉండేలా సుబ్బారెడ్డి ,సచివాలయ సిబ్బంది ,వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న రేషన్ బియ్యం వాహనం ఎక్కడ?



**ఉదయగిరి,నవంబర్9,ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని జి.అయ్యవా రిపల్లి గ్రామంలో గల ఎస్సీ కాలనీకి జగనన్న ఏర్పాటు చేసిన రేషన్ బియ్యం వాహనం రావడంలేదని బాధితులు ఆరో పించారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఇంటింటికి వాహనం ద్వారా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తానన్న జగనన్న ప్రభుత్వం మా ఎస్సీ కాలనీ నందు నేటి వరకు ఒక్కసారి కూడా వాహనం రాలేదని మేమందరం నడుచుకుంటూ వెళ్లి రేషన్ షాపు దగ్గర బియ్యం తీసుకుని వస్తున్నామని తెలిపారు.స్థానిక ఉదయగిరి ఎమ్ ఆర్‌వోగారికి వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి చర్యలు లేవని జగనన్న ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలకు మేము అర్హులం కాదా అని వారు ఆవేదన వ్యక్తపరిచారు.దాదాపుగా 40కుంటుబాలు ఉన్న తమ వద్దకి నెలలో ఒక్కసారి కూడా వాహనాన్ని పంపడానికి అధికారులకు ఏమిటి ఇబ్బంది అని ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు.తమ బాధలను అర్థం చేసుకుని సామాజిక సాధికార ప్రభుత్వమైన జగనన్న ప్రభుత్వంలో మాకు అన్యాయం జరగకుండా చూడామని జిల్లా స్థాయి అధికారులను వేడుకుంటున్నామని తెలిపారు.

## నూతన ఉపఖజానా కార్యాలయం ప్రారంభం



**వింజమూరు,నవంబర్9,ప్రభాతవార్త :** వింజమూరు తహసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఉప ఖజానా కార్యాలయాన్ని ఉదయగిరి వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. అర్చకులు పసుపులేటి శివకుమార్‌శర్మ పూర్ణకుంభంతో రాజగోపాల్‌రెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిఇడబ్ల్యుఐడిసి నుండి 1.8కోట్ల రూపాయలతో ఉపఖజానా కార్యాలయాన్ని నిర్మించారన్నారు. భవనం ఏర్పాటుతో ఉపఖజానా కార్యాలయంలో సిబ్బందికి అన్ని రకాల వసతులతో కూడిన భవన నిర్మాణం జరగడంతో కార్యాలయానికి పనుల పై వచ్చే వారికి త్వరితగతిన జరుగుతాయన్నారు. ఈకార్యక్రమంలో డిడిఎ మోహన్‌రావ్, డిడి గంగాద్రి, ఎటిఒ లోకేష్‌బాబు, ప్రసాద్‌రెడ్డి, స్థానిక ఎస్‌టిఒ దయాకర్, సీనియర్ అసిస్టెంట్ వివేక్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రమేష్‌బాబు , తహసిల్దార్ చొప్పారవీంద్రబాబు, ఎంపిడిఒ రాజేష్‌బాబు, జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ నల్లగొండ్ల సృజన, సొసైటీ చైర్మెన్ మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, మండల తాజా, మాజీ కన్వీనర్ లు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు పల్లాల కొండారెడ్డి, వైసిపి యువజన నాయకులు గణపం రమేష్‌రెడ్డి, గువ్వల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు షేక్ కాలేషా, బయపురెడ్డి విజయకృష్ణారెడ్డి, మద్దూరు బాలకృష్ణారెడ్డి, ఎం.రాజారామిరెడ్డి, గున్నం ప్రసాద్‌రెడ్డి, మండాది గోవిందరెడ్డి, అంకినపల్లి నర్సింహారెడ్డి, భోజనపు గోపి , కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విశ్వరూప మహాసభతో మాదిగల శక్తిని నిరూపిద్దాం

**వింజమూరు,నవంబర్9,ప్రభాతవార్త :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో జరిగే విశ్వరూప మహాసభలో మాదిగల ఐక్యతను చాటుదామని ఎంఎస్‌పి కన్వీనర్ పందిటి అంబేద్కర్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని తక్కెళ్ళపాడు, ఊటుకూరు, వెంకటాద్రిపాళెం ,గుండెమడకల గ్రామాల్లో గడపగడపకు విశ్వరూప మహాసభ కరపత్రాలను ఎంఎస్‌పి ఇన్‌చార్జ్ జి.ఆనందరావ్‌మాదిగ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు .మాదిగల చిరకాల కోరిక ఎస్సీ వర్గీకరణ సాధనకై హైదరాబాదులో ఈనెలాఖరులో జరిగే విశ్వరూప మహాసభ చిట్టచివరి యుద్ధమని వర్గీకరణ సాధన యుద్ధంలో ప్రతి గ్రామం నుండి మాదిగలు స్వచ్ఛందంగా తరలి రావాలన్నారు. ఈకార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్రమోడి హాజరవుతారన్నారు. కావున పెద్ద ఎత్తున మాదిగలు తరలి రావాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నాయకులు వెంగబాబు, ఎస్.ప్రసాద్, ఇ.ప్రసన్న, ఎన్.రవి, ఇతర గ్రామాల నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు విద్యను అందించేందుకే ట్యూషన్లు



**సీతారామపురం నవంబర్ 9 ప్రభాతవార్త** నిరుపేద విద్యార్దులకు విద్యను మరింత దగ్గరకు చేర్చడానికి ఎంఆర్‌ఆర్ ట్రస్టు ఆద్వర్యంలో ట్యూషన్ల గురువారం నుండి ప్రారంబించామని ఎంఆర్‌ఆర్ ట్రస్టు అధినేత ముడమాల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సీతారామపురంలోని పంచాయితీ కార్యాలయం సమీపాన ట్యూషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు నిరుపేద విద్యార్దులకు విద్యను అందించి ఉన్నత స్ధానానికి చేరుకోవడంలో తనవంతు కృషి చేస్తానని తమ ట్రస్టు తరపున జిల్లా వ్యాప్తంగా ట్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా కనీసం 20 మంది విద్యార్దులు ట్యూషన్‌కు వచ్చే విధంగా ఉంటే ఆ ప్రాంతంలో ట్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.మొదటగా మండలంలో 5ట్యూషన్ సెంటర్లను ప్రారంభిస్తామని వీలైనంత త్వరలో నియోజ కవర్గంమొత్తం వ్యాపింపచేస్తామని అన్నారు. ఉపాధ్యాయులు,పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా జగనే ఎందుకు కావాలి

**మనుబోలు,నవంబర్ 9,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మనుబోలు లో గురువారం సచివాలయం-1 పరిధిలో వైస్సా ర్‌సిపి పార్టీ ఆధ్వర్యంలో జగనే ఎందుకు కావాలి కార్యాక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గురువారం సాయంత్రం వీరభద్ర దేవాలయం వద్ద వైకాపా పార్టీ జెండాను మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి ఎగురవేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేశారనీ హరగోపాల్ రెడ్డి తెలిపారు.ఎంపీపీ గుండాల వజ్రమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయనన్ని అభివృద్ధి కార్యక్రమాలు జగన్‌మోహన్ రెడ్డి చేశారన్నారు.తాను చేసిన అభివృద్ధి పనులు,ప్రభుత్వ పథకాలను చూపి రాబోవు ఎన్నికల్లో వైకాపా పార్టీ కి ఓటు వేసి గెలిపించాలనీ,అడుగుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగనమోహన్ రెడ్డి అనీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ దాసరి భాస్కర్ గౌడ్ తెలిపారు.జెసిఎస్ కన్వీనర్ కడివేడి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నినాదాలతో హోరెత్తించారు.ఈ కార్యక్రమములో సర్పంచ్ కంచి పద్మమ్మ,ఎంపిటిసి దువ్వూరి రాజేశ్వరి,నాయకులు ముంగర రవీంద్రరెడ్డి,బొమ్మిరెడ్డి రామాసుబ్బారెడ్డి,కమలాకర్ రెడ్డి ,కోటేశ్వర్ గౌడ్,గృహ సారధుల కాండ్రా నాగమణి,చల్లా నవకోటి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాలు అందజేసిన మేకపాటి



**సీతారామపురం నవంబర్ 9 ప్రభాతవార్త** మండలంలోని పలువురు రైతులకు 2018లో సిజెఎఫ్ భూములను పట్టాలుగా అందించగా కొంతమందికి పట్టాల పంపీణిలో జాప్యం జరగగా ప్రస్తుతం పెండింగ్ సమస్యలు తొలగిపోయి రైతులకు పట్టాలు పంపీణి కార్యక్రమం జరిగింది.రైతులకు సంబందించిన సిజెఎఫ్ భూములకు చెందిన పట్టాలను ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అందజేశారు.గురువారం స్దానిక మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు పట్టాలను అందించారు. మండలంలోని అయ్యవారిపల్లి 29, గంగవరం 78, గుండుపల్లి 29,చిన్ననాగంపల్లి 94 బసినేనిపల్లి 2016 సింగారెడ్డిపల్లి 37 మొత్తం 483 మంది రైతులకు పట్టాలు అందజేశారు. ఈకార్యక్రమంలో తహసిల్దారు ఎంవికె సుధాకర్‌రావు , ఎంపిడిఓ రంగసుబ్బరాయుడు ,ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి జడ్‌పిటిసి చెరుకుపల్లి రమణారెడ్డి,మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి,వైస్‌ఎంపిపి బసిరెడ్డికృష్ణారెడ్డి, అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్‌యాదవ్,జెసి కన్వీనర్ బాలినేని మాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చేజర్లలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం ప్రారంభం

**చేజర్ల,నవంబర్9,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన చేజర్ల గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలనే ప్రచార కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిపి తూమాటి విజయభాస్కర్‌రెడ్డి , జడ్పీటిసి సభ్యులు పీర్ల పార్థసారధి పాల్గొన్నారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ ప్రజల్లోకి వెళ్ళి గత టిడిపి ప్రభుత్వానికి, ప్రసుత్త వైసిపి ప్రభుత్వానికి గల



తేడాలను తెలియజేయాలన్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఏ పథకాలు వచ్చాయి ఈ ప్రభుత్వంలో ఏ పథకాలు వచ్చాయో ఇంటింటికి వెళ్ళి తెలియజేయాలన్నారు. 2024 సార్వత్రికెన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని సిఎంగా చేసుకోవాలని, అలాగే ఆత్మకూరు నియోజకవర్గంలో శాసనసభ్యులుగా మేకపాటి వి క్రమ్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ఈకార్యక్రమానికి వైసిపి సీనియర్ నాయకుడు , సొసైటీ అధ్యక్షుడు బూదళ్ళ వీరరాఘవరెడ్డి హాజరయ్యారు. దీంతో వైకాపాలో మరోసారి వర్గబేధాలు బయటపడినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఈకార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ పూనూరు గంగాధర్‌రెడ్డి, మాజీ ఎంపిపి అన్నలూరు శ్రీనివాసులులనాయుడు, ఎంపిడిఒ విజయలలిత, గ్రామసర్పంచ్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి రామయ్య, వైకాపా నాయకులు, అధికారులు పాల్గొనా న్నరు.

## పేట పంచాయతీకి 6.5లక్షల ఆదాయం



**అనుమసముద్రంపేట,నవంబర్9,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఏఎస్‌పేట పంచాయతీకి వాహనాల వేలంపాట ద్వారా 6.5లక్షల రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జ్ ఇఒపిఆర్‌డి భరత్ తెలిపారు. యాత్రా స్థలమైన ఏఎస్‌పేటకు వచ్చే భక్తుల వాహనాలకు వసూలు చేసే రుసుముకు సంబంబంధించి గురువారం వేలంపాట నిర్వహించారు. ఈపాటలో పంచాయతీ తరపు సర్కారువారి పాట 5లక్షలతో మొదలు పెట్టారు. పలువురు గ్రామసుత్లఉ వేలంపాటలో పాల్గొనగా జల్లి ప్రసాద్ 6.5లక్షలకు పాటను దక్కించుకున్నట్లు ఇన్‌చార్జ్ ఇఒపిఆర్‌డి భరత్ తెలిపారు. ఈవేలంపాటలో పంచాయతీ కార్యదర్శి వినయ్, సర్పంచ్‌భర్త, మైనార్టీ నాయకుడు షేక్ జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు .

## సామాజిక సాధికారత యాత్ర చేపట్టే అర్హత వైసిపికి లేదు



**కావలి, నవంబరు 9 ప్రభాతవార్త** ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీల అభివృద్ధికి వైసిపి గండికొడుతోందని, అలాంటప్పుడు సామాజిక సాధికారత యాత్ర చేపట్టే అర్హత వైసిపి నాయకులకు లేదని టిడిపి నేతలు ఆరోపించారు. కావలి టిడిపి కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్, కావలి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బొమ్మి సురేంద్ర, రాష్ట్ర పార్టీ కార్యదర్శి జెన్ని రమణయ్య, ఆప్కాబ్ మాజీ చైర్మన్ కొండూరు పాల్‌శెట్టి,జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఏగూరి చంద్రశేఖర్, బిసి సాధికారత కమిటీ సభ్యులు సోమయ్యగారి రమణలు పాల్గొని మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో ఎస్సీ,ఎస్టీలపై దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. ఇది వైసిపి నేతలకు తెలియదా, దీనికి కారణం మీరు కాదా అని ప్రశ్నించారు. సామాజిక న్యాయం అనే పదానికి వైసిపి నేతలు అర్థానే మార్చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలుగుదేశం పాలనలోనే ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీలకు అభివృద్ధి జరిగిందన్నారు. రుణాలు ఇచ్చి ఆదుకున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అండగా నిలిచిందన్నారు. ఈ వర్గాల వారికి వైసిపి ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు. సామాజిక సాధికారత బస్సు యాత్ర చేపట్టే అర్హత వైసిపి నాయకులకు లేదని హెచ్చరికలు చేశారు.

## అట్టహాసంగా ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలి



**బుచ్చి నవంబర్ 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని నాగమాంబాపురంలో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని వైసిపి మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి,ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు నేతృత్వంలో నిర్వహించారు. మొదట జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రెండో వరోజు గ్రామం మొత్తం తిరిగి నాలుగున్నార సంవత్సరంలో వైసిపి ప్రభుత్వం హయాంలో పొందిన లబ్దిని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ప్రజలందరు కూడా ఈకార్యక్రమంలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.ఇంత వరకు ఏప్రభుత్వం ఇటువంటి సంక్షేమపథకాలు అమలు చేయలేదని వారు పేర్కున్నారు. ప్రజలందరు ఒక్కసారి ఆలోచించి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని వారు కోరారు.వైసిపి నాయకులు కత్తి మహేష్,ఎంపిడిఒ పెంచలశ్యామ్,సెక్రటరీ హమీద్,ఇఒపిఆర్‌డి పెంచలశ్యామ్ పలువురు వైసిపినాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదరణ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్దన్‌రెడ్డి జన్మదిన వేడుకలు




**బిట్రగుంట, నవంబరు 9 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో గురువారం మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్దన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల విష్ణు వర్దన్‌రెడ్డి అభిమానులు నిర్వహించారు. అనాధలకు భోజనం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్ర మంలో విష్ణు అభిమానులు కర్రెద్దుల రాజేష్, గంజి జయరాం, సతీష్, ఏసుపాదం, పాల్గొన్నారు.

## షిర్డీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు



**బిట్రగుంట, నవంబరు 9 ప్రభాతవార్త** బోగోలు రాజ వీధిలోని స్వర్గీయ అమర బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీ షిర్డీ సాయి బా బా మందిరంలో గురువారం ఛారిటబుల్ ట్రస్ట్‌చైర్మన్ ప్రవాసాంధ్రులైన బచ్చు కృష్ణ కుమార్, సంధ్య దంపతులు ప్రత్యేక పూ జలు నిర్వహించారు. అన్నదాన కార్యక్ర మం చేపట్టారు.తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సాయిబాబా మంది రంలో తమ సోదరి స్వర్గీయ బచ్చు అమ ర ఆశయలకు అనుగుణంగా కార్యక్రమాలను సాయి సేవకులు నిర్వహించడం పట్ల వారిని ప్రశంసించారు.

## వాత్సల్య చిల్డ్రన్స్ హోమ్‌లో దత్తత మాసం అవగాహన సదస్సు




**నెల్లూరు టౌన్, నవంబర్ 9, ప్రభాతవార్త** నెల్లూరులోని బీవీ నగర్‌లో గల వాత్సల్య చిల్డ్రన్స్ హోమ్ నం దు గురువారం ఐసీడీఎస్, ఊపీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో దత్తత మాసం అవగాహన సదస్సు నిర్వ హిం చారు. ఈ సెలబ్రేషన్ ఆఫ్ నేషనల్ అడాప్షన్ మంత్‌నవంబర్-2023 గురించి దత్తత కొరకు దరఖాస్తు చేసు కున్న తల్లిదండ్రులతో దత్తతకు సంబంధించి అన్ని సందేహాలను కూలంకషంగా వివరించారు. దత్తతకు ఎలా దరఖాస్తు చేసుకోవడం, ఏమేమి డాక్యుమెంట్స్ కావాలి, ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి, మొదలైన విషయాల గురించి వివరించారు. నెల్లూరు డీపీఓ డి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దత్తతకు అర్హత కలిగిన సీసీఐలో పిల్లలని ఇసీఏఆర్ఏలో వారి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. వాత్సల్య డైరెక్టర్ జీవీ సాంబశివరావు మాట్లాడుతూ తమ చిల్డ్రన్స్ హోమ్ నందు దత్తతకు అర్హత కలిగి ఉన్న పిల్లలు ఉంటే తాము దత్తత ఇవ్వ డానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్, నెల్లూరు డీపీఓ డి.సుబ్రహ్మణ్యం, నెల్లూరు వీఆర్వో టి.వీరయ్య, సీజేడబ్ల్యూసీ డైరెక్టర్ ఐ.శ్రీనివాసులు, సీడబ్ల్యూసీ సభ్యులు బి.శ్రీనివాసులు, దత్తత తీసుకున్న, తీసుకునే తల్లిదండ్రులు, డీసీసీయు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వైసీపీ జెండా ఆవిష్కరణ



**కోవూరు, నవంబరు9ప్రభాతవార్త :** మా నమ్మకం నువ్వే జగన్.. మరలా జగనే ముఖ్యమంత్రిగా ఎందుకు అనే కార్యక్రమానికి సంబంధించి స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో గురువారం వైసీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మరలా వైసీపీ అధికారంలోకి వస్తేనే ప్రభుత్వ పథకాలు ముందుకు సాగుతాయని దీనిని దృష్టిలో పెట్టుకుని రానున్న ఎన్నికల్లో మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, కోవూరును అభివృద్ధి పథంలో పయనింపజేస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి , గ్రామ సర్పంచ్ విజయ, ఉపసర్పంచ్ మైనుద్దీన్, ఎంపీడీవో శ్రీహరి, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్‌సింగ్, నేతలు కె. ప్రసాద్, శివకుమార్‌రెడ్డి, చిరంజీవి, అంజన్‌రావు, తదితరులు ఉన్నారు.

## ఉదయగిరి పట్టణ వైసీపీ అధ్యక్షులుగా గాజుల షాజుద్దీన్



ఉదయగిరి,నవంబర్9,ప్రభాతవార్త మండలకేంద్రమైన ఉదయగిరికి వైయస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులుగా గా జుల షాజుద్దీన్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి,ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నియమిం చా రు.మేకపాటి కుటుంబానికి అత్యంత సన్నిహితులైన గాజుల షాజుద్దీన్ ఫ్యామిలీ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఉదయగిరి పట్టణ బాధ్యతలను అ ప్పగించిన రాజగోపాల్‌రెడ్డిని 2024లో వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేసి ఆయనను అఖండ మె జారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు.గాజుల షాజుద్దీన్‌కు ఉదయగిరి పట్టణ వైయస్సార్‌సీపీ అధ్యక్షత బాధ్యతలు ఇవ్వడాన్ని ఉదయగిరి ముస్లిం సోదరులు సంతోషాన్ని వ్యక్తపరిచారు.

## బాల్య వివాహాలు అరికట్టేలా సమిష్టి కృషి అవసరం




**కోవూరు, నవంబరు9ప్రభాతవార్త :** కోవూరు మండలంలో బాల్య వివాహాలు జరగకుండా సమిష్టి కృషి అవస రమని , ఈ దిశగా గ్రామాల్లో తల్లిదండ్రుల్లో ఈ విషయమై మరింత అవగాహన పెంచేలా ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీపీ టి. పార్వతి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు ఆడ పిల్లలకు చేస్తే ఏ విధమైన నష్టాలు వస్తాయో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైన దృష్ట్యా ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ఆరోగ్య సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నెలలకు ఒక పర్యాయం నిర్వహించే ఈ సమావేశాలకు మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సోమశిల జలాశయం నుంచి రెండవ పంటకు నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకో వాలని కోరగా.. అందుకు రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14వ తేది ఇరిగేషన్ సమావేశం ఉందని, ఆ సమావేశంలో నీటి విడుదల విషయమై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి పెడతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, తహసీల్దార్ పద్మజ, ఎంపీడీవో శ్రీహరిలు ఉన్నారు.

## మేలుజాతి పశు ఉత్పత్తిపై దృష్టి సారించాలి



**కోవూరు, నవంబరు9ప్రభాతవార్త :** రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా రైతులకు కేవ లం పెయ్యదూడలు మాత్రమే పుట్టే పద కాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, దీని ద్వా రా మేలుజాతి పశు ఉత్పత్తిపై రైతులు దృష్టి పెట్టాలని ఆంధ్ర ప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ అదనపు ముఖ్య కార్యనిర్వాహణా ధి కారి డాక్టర్ ఎస్. రజనీ కుమారి అన్నారు. స్థానిక శాంతినగర్‌లోని పశు వైద్యశాల ప్రాం గణంలో గురువారం పెయ్యదూడలు పుట్టిన రైతులకు మినరల్ మిక్చర్, కాల్షియం టానిక్, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఈ పథకం ద్వారా ఒక్కో క్క పశువుకు రూ.500 చెల్లిస్తే 850 రూపాయలను ప్రభు త్వమే సబ్సిడీతో చెల్లిస్తుందన్నారు. ఇటువంటి మంచి పథకాన్ని రైతులు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో మేలుజాతి పశువులు అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు సంవ ర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి. మహేశ్వరుడు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. నాగమణి, డీఎల్‌డీఏ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ సోమయ్య,అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య్,, ఏవీహెచ్ సజ్జాద్, రైతులు ఉన్నారు.

## పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలి



**కోవూరు, నవంబరు9ప్రభాతవార్త :** మానిఫెస్టోలో చెప్పిన ప్రతి వాగ్దానాన్ని తూచా తప్పకుండా అమలు చేసి ప్రజల హృదయాలు గెలుచుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరలా తిరిగి పట్టం కట్టేలా చూడాలని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంపై వలంటీర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వందల కొద్దీ వాగ్దానాలు చేసి ఒక్క వాగ్దానం కూడా నెరవేర్చకుండా లక్షల కోట్లు అప్పు పెట్టి వెళ్లిందన్నారు. ఇటువంటి సమయంలో ముఖ్యమంత్రిగా బాధ్యత స్వీకరించిన జగన్‌మోహన్‌రెడ్డి లోటు బడ్జెట్‌లో ఉన్నా కరోనా కారణంగా ఆర్థిక సంక్షభం ఏర్పడినా లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసి ఏపీలో తలసరి ఆదాయాన్ని గత ప్రభుత్వ పాలనలో 17వ స్థానంలో ఉండగా ప్రస్తుతం దానిని 9వ స్థానానికి తీసుకొచ్చిన ఘనత ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ముఖ్యంగా వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా ఇంటి ముంగిటికే పథకాలు అందించిన ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు. అదేవిధంగా గ్రామ సచివాలయం వ్యవస్థ ఏర్పాటు చేసి దీంతో పాటు వైఎస్సార్ పీపుల్స్ క్లినిక్‌లను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసి ఆరోగ్య, సంక్షోభ కార్యక్రమాలు ప్రజల ముంగిటికే తెచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. గతంలో పింఛన్ కోసం గంటల తరబడి ఎండలో నిలబడాల్సిన పరిస్థితి ఉండేదని ప్రస్తుతం ప్రతి నెల1వ తేదినే వేకువజామునే ఇంటి తలుపు తట్టి పథకాలు అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 87 శాతం మంది కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు..ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ మాట్లాడుత్డూ గతంలో గెలిచిన శాసనసభ్యులు అనంతరం ఏనాడు కూడా ఇంటింటికీ వెళ్లిన దాఖలాలు లేవన్నారు. అటువంటి దానిని తిరగరాసి గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం ద్వారా ఏయే పథకాలు అందిచారో వారికి వివరించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు నాయుడు జైలుపాలు అయ్యారని, ప్రతిపక్షం చెప్పే మాటలు ప్రజలు నమ్మరన్నారు. నవవంబర్ 10వ తేది నుంచి డిసెంబర్ 10వ తేది వరకు వలంటీర్లు, స చివాలయ కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వం ఏం చేసింది.. ఈ ప్రభుత్వం ఏం చేసింది అనే విష యాలను వారికి వివరించి అవగాహన కల్పించేలా ప్రతి వలంటీర్ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా డిస్‌ప్లే బోర్డును ప్రజా ప్రతినిధులు, నేతలు ఆవిష్కరించార్డి, మండల కన్వీనర్ సుబ్బా రెడ్డి, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి , గ్రామ సర్పంచ్ విజయ, ఉపసర్పంచ్ మైనుద్దీన్, కార్పొరేషన్ చైర్మన్ కిషోర్‌సింగ్, నేతలు కె. ప్రసాద్, శివకుమార్‌రెడ్డి, చిరంజీవి, అంజన్‌రావు, తదితరులు ఉన్నారు.

## పశు విజ్ఞాన బడిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, నవంబరు9ప్రభాతవార్త :** మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో పాడి రైతులకు పశు విజ్ఞాన బడి ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, వాటిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నాగమణి అన్నారు. స్థానిక కోవూరులోనిచ పశు వైద్యశాల సమావేశం మందిరంలో గురువారం పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశువులకు కూడా మొబైల్ అంబులెన్స్ సేవలను ఏర్పాటు చేసిందని, అత్యవసర పరిస్థితుల్లో పాడి రైతులు ఈ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా ఈ పశు వైద్యశాల ప్రాంగణంలో వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, పాడి రైతులు ఈ సేవలను కూడా ఉపయోగించుకోవాలన్నారు. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కల్పించేలా పశు సహాయకులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కృష్ణమౌర్య, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ షేక్ సజ్జాద్, పశు సహాయకులు, రైతులు ఉన్నారు.

## మొక్కలు జీవకోటికి ప్రాణవాయువును ఇస్తాయి



**కోవూరు, నవంబరు9ప్రభాతవార్త :** మొక్కలు నాట డమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టిన ప్పుడే అవి జీవకోటికి ప్రాణవాయువును ఇస్తాయని ఆంధ్ర ప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లప ల్లి విజయ్ కుమార్ తెలిపారు. కొత్తూరులోని పశుగ ణాభివృద్ధి సంస్థ కార్యాలయ ప్రాంగణంలో గురు వారం ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ అదన పు ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ ఎస్. రజ నీకుమారితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మొక్కల పెంపకాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ సోమయ్య, డాక్టర్ వసంత రాయలు, డైరెక్టర్లు, వెంకటరమణయ్య, మల్లికార్జున, తదితరులు ఉన్నారు.

## నూతన టెక్నాలజీతో మేలుజాతి పశువుల అభివృద్ధి



**కోవూరు, నవంబరు9ప్రభాతవార్త :** రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా రాష్ట్రంలో ఇప్పటివరకు 37418 కృత్రిమ గర్భధారణ చేపట్టడం జరిగిందని ఆంధ్ర ప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ అదనపు ముఖ్య కార్యని ర్వాహణాధికారి డాక్టర్ ఎస్. రజనీ కుమారి అన్నారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం కొత్తూరు గ్రామంలోని పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో గురువారం ఆమె రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 60 వేలు పెయ్యదూడలు పెట్టాలని, రైతన్నకు లక్ష్మీకల పట్టాలని ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ 2023-24 లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం పిండ మార్పిడి ద్వారా ఒక పశువు ఎదకు వచ్చినప్పుడు అండాశయం నుంచి ఒకే అండం విడుదల అవుతుందని , కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా వీర్యదానం చేయించినప్పుడు చూలు కట్టే పరిస్థితి వస్తుందన్నారు. ఈ రకమైన టెక్నాలజీని పాడి పశువుకు ప్రవేశపెడితే జీవితకాలంలో 8 నుంచి 10 దూడలు పుట్టే అవకాశం ఉంటుందన్నారు. భారతదేశంలోనే అతి మూల్యమైన జన్యువనరులను ఒంగోలు, పుంగనూరు పశువుల ద్వారా పునోత్పత్తి చర్యలు చేపట్టి తద్వారా దేశవాళి జాతులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం జరి గిందన్నారు. ఈ పిండమార్పిడి పద్ధతి ద్వారా ప్రతి సంవత్సరం మేలుజాతి ఆవు నుంచి 150 పిండాలను ఉత్పత్తి చేయవచ్చన్నారు. తద్వారా 50 నుంచి 60 వరకు దూడలను పొందేవరకు అవకాశం ఉంటుందన్నారు. దీనికి సంబంధించి రాష్ట్రస్థాయిలో 19 మంది పశువైద్య శస్త్రచికిత్సలకు ఎంబ్రియో ట్రాన్స్ ఫర్ టెక్నాలజీపై గుంటూరులోని లాంగ్ ఫామ్‌లోనూ జాతీయ కామధేను పునర్పుత్తి కేంద్రంలోనూ పిండోత్పత్తి ప్రయోగశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఈ ప్రయోగశాలలో మేలుజాతి ఒంగోలు, పుంగనూరు, గిర్, సాహివాల్, ముర్రాజాతికి చెందిన 161 పిండాలను ఉత్పత్తి చేయడం జరి గిందన్నారు. ఇప్పటివరకు 161 పశువులకు ఈ పిండమార్పిడి పశువుల ద్వారా 28 పశువులకు చూలు కట్టడం జరిగిందన్నారు. ఇటువంటి మేలుజాతి పశు సంపదను రాష్ట్రమంతా అంతరించే ధ్యేయంతోనే ప్రభు త్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా 50 శాతం సబ్సిడీతో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పశువులకు, గొర్రెలకు కోళ్ల పెంపకంకు దానా దాణా తయారు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఒక్కొక్క యూనిట్‌కు కోటి రూపాయల నుంచి మంజూరు చేయడం జరిగిందని, ఇందులో 50 శాతం సబ్సిడీ పోవడం జరుగుతుందన్నారు. గోకుల్ మిషన్ అమలు చేస్తున్న జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం ద్వారా రైతులు మేలుజాతి పథకం ఉత్పతి కోసం లేగదూడల పెంపకం చేపట్టి తమ ఆదాయ అభివృద్ధితో జీవనప్రమాణాలు పెంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి. మహేశ్వరుడు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. నాగమణి, డీఎల్‌డీఏ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ సోమయ్య, డాక్టర్ ఆర్. వసంతరాయలు ఉన్నారు.

## వెంగల్‌రావునగర్ స్కూల్‌కు బస్సు కల్పించండి



**ఉదయగిరి,నవంబర్9,ప్రభాతవార్త** ఉదయగిరి మం డలం వెంగల్‌రావు నగర్‌కు చెందిన జడ్పి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు సరైన టైమ్‌ల్ బస్సు సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తపరిచారు.చుట్టు పక్కల గ్రామాలైన సున్నంవారిచింతల, గుడినెరవ, కొండారెడ్డిపల్లి,దుం పవారిపల్లి,కొత్తపల్లి గ్రామాల నుండి బాలబాలికలు దా దాపు 70మంది ఈ స్కూల్‌లో విద్యను అభ్యసించ డా నికి వస్తున్నారని,వారిలో 30శాతం మంది సైకిళ్లపై, మిగిలిన వారు కాలి నడకన గానీ,ఎవరినైనా లిఫ్ట్ అడిగి కానీ స్కూల్‌కు చేరుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానో పాధ్యాయురాలు షేక్.నూర్ జహాన్ మాట్లాడుతూ ఉదయం 9గంటలకు గండిపాలెం రూట్‌లో బస్సు ఉందని కానీ అది 9:05,9:10కి వస్తుందని స్కూల్ టైమ్ ప్రకారం 10వ తరగతి విద్యార్థులకు స్టడీహావర్స్ ఉన్నందున వెంగల్‌రావు నగర్‌కు 8:30గంటకి,సాయంత్రం 4:30గంటల సమయాలలో బస్సు ఏర్పాటు చేస్తే అటు విద్యార్థులకే కాకుండా ఉపాధ్యాయులు కూడా ఆ బస్సును వినియోగించుకుంటారని ఆమె తెలిపారు.కావున డిపో మేజనర్,గ్రామ సర్పంచ్,ప్రజా ప్రతినిధుల చొరవ తీసుకుని విద్యార్థులకు మేలు కలిగే విధంగా బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఆమె విన్నవించారు.

## చెన్నకేశవ స్వామి ఆలయానికి విరాళం



**ఉదయగిరి,నవంబర్9,ప్రభాతవార్త** ఉదయగిరి మండలం గండిపాలెం గ్రామంలో జీఎమ్‌కె ట్రస్ట్ అధినేత గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి వరి కుంటపాడు మండలం ఎర్రంరెడ్డి పల్లెలో నూత నంగా నిర్మిస్తున్నటువంటి చెన్నకేశవస్వామి ఆల య నిర్మాణానికి తనవంతుగా 25వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ నగదును జిఎ మ్‌కె ట్రస్ట్ ప్రతినిధులైన వెంకటేశ్వర్లు,షేక్.గపూర్ తదితరుల ద్వారా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుల ద్వారా అందజేయడం జరిగిందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఎర్రంరెడ్డిపల్లి గ్రామ స్తులు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ట్రెజరరీ భవనం ప్రారంభించిన మేకపాటి



**ఉదయగిరి,నవంబర్9,ప్రభాతవార్త** ఉదయగిరి నియోజకవర్గంలో కొత్త ట్రెజరరీ భవనాలను ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి,సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు.ఉదయగిరి మండలంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో కొత్తగా నిర్మించిన భవనానికి ముఖ్యఅతిధిగా పాల్గొని భవనాన్ని ప్రారంభించి సిబ్బందికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి బ్రిటీష్‌కాలం నాటి పాత భవనంలో ట్రెజరరీ కార్యకలాపాలను సాగిస్తూ నేడు కొత్త భవనంలో సేవల ప్రారంభించిన ట్రెజరరీ సిబ్బందికి అభినందనలు తెలిపారు.ట్రెజరరీ కార్యాలయానికి వచ్చే వారికి సిబ్బంది అందుబాటులో ఉంటూ పలు సేవలు అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్టిఓ మమత,శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి జన్మదిన వేడుకలు



**కావలి, నవంబరు 9 ప్రభాతవార్త** మాజీ శాసనసభ్యులు, సీనియర్ నాయకులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలు కావలి పట్టణంలోని ఆయన అభిమానులు, నాయకులు, కార్యకర్తల మధ్య గురువారం ఘనంగా నిర్వహించారు. కావలి ఏరియా వైద్యశాలలోని రోగులకు రొట్టెలు, పండ్లు ఆయన అభిమానులు పంపిణీ చేసి కాటంరెడ్డిపై వున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ప్రజలకు ఎల్లవేళలా అండగా వుంటూ ఎవరికి ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ వారికి భరోసా కల్పిస్తూ వారికి సహాయ సహకారాలు అందిస్తూ అండగా మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి నిలుస్తున్నా రన్నారు. నమ్మకానికి, స్నేహానికి, సహకారానికి నిలువెత్తు నిదర్శనమని తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో రానున్న రోజుల్లో ఎంతో మందికి సేవ చేస్తూ అండగా వుండేందుకు భగవంతుడి ఆశీస్సులు ఎల్లవేళలా వుండాలని కోరారు. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి చేతుల మీదుగా రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అభిమానులు పాలవల్లి పద్మనాభరెడ్డి, పంగా వెంగళ్‌రెడ్డి, ఆల్తూరి సతీష్‌రెడ్డి, రామ్‌కోటారెడ్డి, పూనూరు మురళీధర్‌రెడ్డి, దద్దాల ప్రభాకర్‌గౌడ్, కె.గోపీకృష్ణ, పాలడుగు వెంకట్రావు, చిలకా చంద్రమోహన్, బత్తల నాగేశ్వరరావు, బాలకృష్ణారెడ్డి, మద్దులూరి కొండల్, మస్తాన్‌రెడ్డి, రామచంద్రాపురం శ్రీను, అప్పల కళ్యాణ్‌చక్రవర్తి, కున్నం తిరుమల్‌రెడ్డి, కుంతూరు శ్రీను, దద్దాల వెంకటస్వామి, టి.డి.రాజు, కె.మల్లికార్జునరెడ్డి, మహేష్, కోసూరు గోపాలకృష్ణ, సూరగాని ప్రభాకర్, గుర్రం మల్లికార్జునచౌదరి తదితరులు పాల్గొన్నారు.

## బడుగు, బలహీన వర్గాల సాధికారికత వైసిపితోనే సాధ్యం



**బిట్రగుంట, నవంబరు 9 ప్రభాతవార్త** రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీల సాధికారికత వైసిపితోనే సాధ్యమని రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్‌రావు చెప్పారు. బోగోలు మండలం కడనూతలలోని ఆస్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన తండ్రి రాజశేఖర్‌రెడ్డి ఆశయాల సాధన కోసం ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఉన్నత పదవులు కట్టబెట్టి వారి సాధికారికత కోసం కృషి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో 2 లక్షల 38 వేల కోట్ల రూపాయలు డిబిటి ద్వారా వివిధ పథకాల అమలు కోసం నిధులు ఖర్చు చేశారన్నారు. బిసిలను రాజ్యసభ పంపడం కాని వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం కానీ గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. త్వరలో బిసిల కులగణన కూడా జరగబోతుందని తద్వారా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెరుగుతాయన్నారు. గత నాలుగున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆయన వివరిస్తూ గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్న నువ్వే కావాలి,సాధికారికత బస్సు యాత్రకు అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. మూడో సారి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించి జగనన్నకు కానుకగా అందజేస్తామన్నారు.మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన ఆచరణలో అమలు చేయడమే కాకుండా స్థానిక సంస్థలలోనూ, కార్పొరేషన్ల పదవులలో ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీలకు సముచిత స్థానాన్ని కల్పించారన్నారు. ఎన్నికల కోసం ఈ బస్సు యాత్రని తలపెట్టలేదని రాజ్యాంగ పరంగా, నామినేటెడ్ పరంగా ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీల కోటాలో తాము పొందిన పదవులు తెలియజేసి వైపిపి ప్రభుత్వం ఏమి చేస్తుందో వివరించడానికి వచ్చామన్నారు. ఎంతో ఉన్నత ఆశయంతో ఈ వర్గాలకు పదవులను కట్టబెట్టడమే కాకుండా ఆయా వర్గాలతో మమ్మల్ని మమేకం చేయడం ముఖ్యమంత్రి ఆలోచన ఎంతో పారదర్శకమైందన్నారు. ఈ సమావేశంలో వైసిపి రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యులు, వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## జగనన్న ఇళ్ళలో జరిగిన అవినీతిపై కేంద్ర సంస్థలతో దర్యాప్తు చేపట్టాలి



**కావలి, నవంబరు 9 ప్రభాతవార్త** నాసిరకంగా నిర్మించిన జగనన్న ఇళ్ళలో జరిగిన అవినీతిపై కేంద్ర సంస్థలతో దర్యాప్తు చేపట్టాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం అధ్యక్షతన కావలి ముసునూరులోని జగనన్న లేఅవుట్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయిన ఇళ్ళను బిజెపి నేతలు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ళ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీ స్థాయిలో ఇళ్ళను మంజూరు చేశారన్నారు. అందులో భాగంగా నిర్మిస్తున్న ఇళ్ళను రాష్ట్ర ప్రభుత్వం నాసిరకంగా నిర్మాణం చేస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, గుత్తేదారుల స్వలాభం కోసం ఇళ్లను నాసిరకంగా నిర్మిస్తున్నారని విమర్శించారు. జగనన్న లేఅవుట్ల పేరుతో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ ఇళ్ళ నిర్మాణానికి సముద్ర ఇసుక వాడుతున్నారని గతంలో పలుమార్లు హెచ్చరించామన్నారు. ఈ నాసిరక నిర్మాణాలకు అధికారులను బాధ్యులు చేయాలని డిమాండ్ చేశారు.సంబంధిత అధికారులపై విచారణ చేపట్టాలని కోరారు. అధికార పార్టీ నాయకుల అవినీతి దాహంలో పేద ప్రజలు కొట్టుకుపోతున్నారన్నారు. కావలి నియోజవర్గంలో జరిగిన అవినీతి, అక్రమాలు రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో జరగలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధికార బస్సు యాత్రను తుస్సు యాత్రగా అభివర్ణించారు. రాష్ట్రంలో జరిగే ఇళ్ళ నిర్మాణంలోని అవకతవకలపై కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు పురంధేశ్వరిపై అనుచిత వ్యాఖ్యలు చేసే నైతిక హక్కు అవినీతి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కానీ, ఇతర వైసిపి నాయకులు కానీ లేదని తెలిపారు.బిజెపి కావలి పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం మాట్లాడుతూ ముసునూరు లేఅవుట్‌లో నిర్మించే ఇళ్లు మానవ నివాసయోగ్యంగా లేవన్నారు. కొత్తగా నిర్మించే ఇళ్లు కూలిపోవడం ఎంతో బాధాకరమన విషయమన్నారు. కాసులకు కక్కుర్తి పడిన అధికారులను, కాంట్రాక్టర్లను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. నాసిరకంగా నిర్మించిన ఇళ్లు కూలిపోతుంటే అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదన్నారు. పేదలకు నిర్మించే ఇళ్లపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ళ నిర్మాణాలకు ఇచ్చే నిధులను దుర్వినియోగం చేశారని తెలిపారు. ఈ ఇళ్ళ లబ్దిదారులు ఇళ్లు నిర్మించే ప్రాంతాన్ని సందర్శించి అధికారులను, స్థానిక నాయకులను నాసిరకమైన ఇళ్ల నాణ్యత గురించి ప్రశ్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు మంద కిరణ్‌కుమార్, లక్కరాజు భాస్కర్, కంచర్ల మురళీకృష్ణనాయుడు, పరుసు వెంకటేశ్వర్లు, సి.వి.సి.సత్యం, కేతిరెడ్డి విష్ణుతేజరెడ్డి, కూరాకుల సవింద్ర, తూమాటి తిరుపతిస్వామి, కటకం మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై మరింత అవగాహన చేసుకోవాలి




**కోవూరు, నవంబరు9ప్రభాతవార్త :** జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మహిళలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాఅడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె. కాత్యాయని మాట్లాడుతూ ప్రధానంగా మైనార్టీ తీరకుండానే బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. మైనార్టీ తీరిన తర్వాతనే వివాహాలు చేయడం వలన మంచిదని ఈ విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా గృహ హింస చట్టం , వరకట్న నిషేదం, ఫోక్సో చట్టం గురించి అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జక్కా శేషమ్మ, కోవూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి స్టాలిన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, లక్ష్మీప్రసన్నలు పలు సూచనలు చేశారు.

## సముద్రపు ఇసుకతో కట్టిన జగనన్న ఇళ్లు



**కావలి రూరల్, నవంబరు 9 ప్రభాతవార్త** చిరుజల్లులకే కూలిపోతున్న కావలి ముసునూరులోని జగనన్న కాలనీలోని ఇళ్ళను 25 శాతం ఇసుక మిగిలిన 75 శాతం సముద్రం ఇసుకతో జగనన్న కాలనీలు కడుతున్నారన్న అనుమానంగా వుందని జనసేన పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ తెలిపారు. ముసునూరులోని జగనన్న మెగా లేఅవుట్లలోని ఇళ్లు చిన్నపాటి వర్షానికే కూలిపోయిన ఇళ్ళను జనసేన నాయకులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అళహరి మాట్లాడారు. కూల్చడంతో ప్రారంభమైన వైసిపి పాలన ఆఖరికి పేదలకు కట్టిస్తున్న ఇళ్ళు చిన్నపాటి వర్షానికే కూలిపోయే స్థితిలో వున్నాయని తెలిపారు. తుఫాన్ లాంటి విపత్కర పరిస్థితి వస్తే ఈ ఇళ్లు కూలిపోయి ఎంతమంది ప్రాణాలు కోల్పోతారో తలుచుకుంటే భయమేస్తుందన్నారు.ఈ ఇళ్లు పునాదుల దశలో వున్నప్పుడే నాసిరకంగా కడుతున్నారని మా అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు నాదెండ్ల మనోహర్ సూచనలతో ఫైల్యూర్ ఆఫ్ జగనన్న కాలనీలు అనే కార్యక్రమాన్ని నిర్వహించి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించడం కూడా జరిగిందని గుర్తు చేశారు. ఆ రోజే పటిష్టంగా ఇళ్ళ నిర్మాణం చేసి వుంటే ఇటువంటి పరిస్థితి వచ్చి వుండేది కాదని తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు.ఇక్కడ కూలిన, కూలడానికి సిద్దంగా వున్న ఇళ్లకు వాడిన సిమెంట్, ఇటుకల మధ్యలో ఇసుకను సేకరించడం జరిగిందన్నారు.ఈ ఇసుక నాణ్యతపై అనుమానం వుందన్నారు. ఈ ఇసుకను పరీక్షలకు పంపడం జరుగుతుందన్నారు. కావలి, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఇసుకతో అప్రమత్తంగా వుండాలని కోరారు. ఈ ఇళ్లు నివాసయోగ్యమైనవి కాదని తక్షణమే వీటిని కూల్చివేసి నూతనంగా నిర్మించి లబ్దిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మా నాయకుడిని ప్యాకేజి స్టార్ అనడం కాదని మీకు, మీ నాయకులకు ఇందులో ఎంత ప్యాకేజి వుందో తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అధికార ప్రతినిధి రిషికేష్, నాయకులు కృష్ణయ్య, నాగార్జున, సుధీర్, శరణ్, జానీ, జిలాని, షమ్మి, రాజా, వీరమహిళలు పాల్గొన్నారు.

## గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



**వరికుంటపాడు,నవంబర్ 9,ప్రభాతవార్త :** గర్భిణీ స్త్రీ లు తప్పక పౌష్టికాహారాన్ని తీసుకోవాలనీ మండల వైద్యాధికారిణి డాక్టర్ కరిష్మా అన్నారు.స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణీ స్త్రీ లకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వ హిం చి,పలు సలహాలు,సూచనలు అందజేశారు.20 మందికి పైగా గర్భిణీలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా వైద్యాధికారిణి కరిష్మా మాట్లాడుతూ గర్భిణీ స్త్రీ లు తప్పక ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.బిడ్డ ఎదుగుదలకు ఉపయోగపడేవిధంగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూ చించారు.ఈ కార్యక్రమములో హెల్త్ సూపర్ వైజర్ లు వెంకటయ్య మేరి ఎవాంజిలి, పిహెచ్‌ఎన్ సుశీలమ్మ,హెల్త్ అసిస్టెంట్ యనమల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరులో కాటంరెడ్డి జన్మదిన వేడుకలు



**అల్లూరు, నవంబరు 9 ప్రభాతవార్త** మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం అల్లూరులోని ఆయన నివాసంలో విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ముందుగా పాత బస్టాండ్ సెంటర్‌లోని వినాయకుని దేవస్థానంలో విష్ణువర్ధన్‌రెడ్డి పేరు మీద ఆయన అనుచరులు, అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన నివాసంలో బాణాసంచా శబ్దాలు, తప్పెట్లు నడుమ భారీ కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టి సంబరాలు చేశారు. అనంతరం ఆయన అనుచరులు మాట్లాడుతూ విష్ణువర్ధన్‌రెడ్డి 40 ఏళ్ల రాజకీయ జీవితంలో పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య పరంగా, విద్యాపరంగా సహాయ సహకారాలు అందించారని తెలిపారు. జమీందారు కుటుంబం నుంచి వచ్చిన ఆయన కావలి నియోజకవర్గంలో నేటికీ ఆయన అనుచరులను, అభిమానులను సుమారు 40 వేల మందిని పేరు గుర్తు పెట్టుకుని పలకరించడం ఆయన ఒక్కడేకు సాధ్యమన్నారు. ఆయన మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, వచ్చే శాసనసభ ఎన్నికలలో ఎమ్మెల్యేగా ఖచ్చితంగా గెలుపొందుతారన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ఆయన అనుచరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హరిహర పుత్ర అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం



**వింజమూరు,నవంబర్9,ప్రభాతవార్త** :వింజమూరులోని ప్రసన్నారెడ్డి నగర్‌లో నూతనంగా నిర్మించిన హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్టతతోపాటు ఇతర దేవతా మూర్తులను ప్రతిష్టా కార్యక్రమాన్ని అశేష భక్త జనసందోహం మధ్య నిర్వహించారు. 34అడుగుల ఏకరాతి ధ్వజస్థంభాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 5వ తేదీ నుండి ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు గురువారం తో ముగిశాయి. చివరిరోజున తెల్లవారుజామునధర్మపురి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద స్వామి యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి కర్పూరహారతి , అనుగ్రహ సంభాషణ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులచే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల శాంతిమహోత్సవ కళా్యణాన్ని నిర్వహించారు. రాత్రికి పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమాలను అయిలావజ్జుల శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్థానిక ఆలయ అర్చకులు సాయిస్వామి, శివాలయ అర్చకులు ఫణిస్వామి, ఆలయ కమిటీ నిర్వాహక సభ్యులు, గ్రామ పురప్రముఖులు , భక్తులు పాల్గొన్నారు.

## హాకీ జాతీయ పోటీలకు ఎంపికైన కార్యదర్శికి కమిషనర్ ప్రశంసలు



**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్9,ప్రభాతవార్త** నవంబర్ 15వ తేదీ నుండి 25వ తేదీవరకు ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయ హాకీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టులో స్థానం సంపాదించిన నెల్లూరు జిల్లా హాకీ క్రీడాకారుడు కొత్తకోట భానుప్రకాష్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ ప్రశంసించారు.నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో సచివాలయ వార్డు ఎడ్యుకేషన్ అడ్ డేటా ప్రోసెంసెంగ్ సెక్రటరీగా భానుప్రకాష్ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.ఈ మేరకు కార్యాలయంలో కమిషనర్‌ను గురువారం కలుసుకుని అభినందనలు అందుకున్నారు.జాతీయ పాటోలలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక ప్రోత్సా హకాలను నగరపాలక సంస్థ తరుపున భానుప్రకాష్ కు పూర్తిగా అందజేయనున్నామని కమిషనర్ ప్రకటించారు.జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి నెల్లూరు నగరపాలక సంస్థ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని కమిషనర్ ఆకాంక్షించారు.

## పెంచలకోన క్రాస్ రోడ్డు బస్ షెల్టర్ వద్ద వ్యక్తి మృతి



**రాపూరు,నవంబరు9ప్రభాతవార్త** మండలంలోని పెంచలకోన..తెగచర్ల క్రాస్ రోడ్డు వద్ద గల బస్ షెల్టర్ వద్ద గురు వారం ఒక వ్యక్తి మృతి చెంది వున్న విషయాన్ని గ్రామస్తులు రాపూరు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చెరుకున్నరాపూరు ఎస్ఐ మాల్యాద్రీ మృతదేహాన్ని పరిశీలించి అక్కడ వున్న ఆదారాల ద్వారా మృతుడు సంగం మండలం,చెర్లోవంగళ్ల గ్రామానికి చెందిన గండవరం కోదండ రామి రెడ్డి(58) గా గుర్తించి వారి కుటుంభ సభ్యుకు సమాచారం అందించారు.మృతుడు బుదవారం పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిదర్శనాంతరం తిరుగు ప్రయాణంలో అనారోగ్య కారణంతో బస్ షెల్టర్ వద్ద మృతి చెందినట్లుగా పోలీసులు బావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమొదు చేసి దర్యాప్తు చెస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పెంచల స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి



**పెంచలకోన(రాపూరు),నవంబరు9ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారిని గురువారం ఉమ్మడిరాష్ట మాజీ ఆర్థిక మంత్రి,వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామ నారాయణ రెడ్డి దర్శించుకున్నారు. స్వామి వారిదర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డికి ఆలయ అధికారులు,అర్చకులు ఆలయ మర్యాదలతోస్వాగతం పలికారు. అనంతరం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, శ్రీ ఆధిలక్ష్మీ అమ్మవారు, శ్రీ అంజనేయ స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆస్థానమండపంలో ఆలయ వేదపండితులు అర్చకులు వేదమంత్రాలతో ఆయనకు ఆశీర్వచనాలు ఆందజేసి స్వామి వారీ తీర్థ ప్రసాదాలను ఆందజేశారు.

## రాపూరులో అట్టహాసంగా ఎపికి జగనే ఎందుకు



**రాపూరు,నవంబరు9ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్టానికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డే ఎందుకు కావలంటే కార్యక్రమం గురువారం అట్టహాసంగానిర్వహించారు. ఈ సందర్భంగా రాపూరు బిట్ 1 సచివాలయంలో వాలంటీర్లు, గృహసారథులతో వైసిపి మండలకన్వీనర్ పాపకన్ను దయాకర్ రెడ్డి సమావేశం నిర్వహించి రాష్టానికి ముఖ్యమంత్రిగా తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు కావాలి అన్న విషయాలను వివరించారు. ప్రతి వాలంటీరు,గృహసారథి ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రిగావైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎందుకు అవసరం అన్న విషయాలను ప్రజలకు తెలియ చెప్పాలన్నారు. అనంతరంప్రభుత్వ గ్రంథాలయం వద్ద వైసిపి పార్టీ జెండాను దయాకర్ రెడ్డి ఇతర నాయకులతో కలసి ఎగురవేశారు. రాత్రినాయకులు పార్టీ ఆదేశాల మేరకు సామూహిక భోజనాలు,సచివాలయం నిద్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ దందోలు నారాయణ రెడ్డి,గ్రామ సర్పంచ్ భూపతి జయమ్మ, యంపీపీ కె.ప్రసన్న,యంపీటీసిఏటూరు గౌరి,పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ నెల్లూరు రవీంద్రా రెడ్డి, నాయకులు శ్రీకిరెడ్డి శశిధర్ రెడ్డి,ఏటూరు మురళీమోహన్ రెడ్డి,ఏటూరు విజయశేఖర్ రెడ్డి, సచివాలయం కన్వీనర్‌లు మాదమాల పిచ్చి రెడ్డి,దమ్మాయి రమణయ్య, ఆరీఫా బేగం,భూపతి జయరామయ్య,పలువురు వైసిపి నాయకులు వాలంటీర్లు పాల్గొన్నారు. వైసిపి ఆధికారిక కార్యక్రమానికి పట్టణనాయకులు గౌర్హాజరు వైఎస్‌ఆర్‌సిపి పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికిమండలంలో ప్రారంభమైన తోలి రోజే రాపూరు పట్టణానికి చెందిన పలువురు వైసిపి ముఖ్యనేతలు గౌర్హాజరు కావడం పట్టణంలో చర్చనియాంచమైంది. తోలినుండి పార్టీ బలోపేతానికి కృషి చేసిన తమకు సరైన ప్రాధాన్యతలేదంటూ రాపూరుకు చెందిన పలువురు ముఖ్య నేతలు పార్టీ నిర్వహించిన ఈ కార్యక్రమానికి హజరు కాకపోవడంతో పలువురు వైసిపి పార్టీ కార్యకర్తలు ఇలాగైతే పార్టీకి నష్టం చేకూరుతుందేమో అని ఆందోళ వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి




ఉదయగిరి,నవంబర్9,ప్రభాతవార్త ఉదయగిరి మండలంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమంలో ఉదయగిరి సివిల్ కోర్టు జడ్జి అంజయ్య ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు,స్కూల్ దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా రాబోయే రోజుల్లో నేరానికి బానిసలు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వలన ఎదుటివారిని గౌరవించే పద్దతి ఏర్పడుతుందని తద్వారా మన చుట్టుపక్కల వారు కూడా మంచి వాతావరణంలో నేరాలు లేకుండా జీవించగలుగుతారని మనమే కాకుండా మన ద్వారా సమాజం కూడా బాగుపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఎస్సై ఇంద్రసేనారెడ్డి,లాయర్ రామారావు,లాయర్ అల్తాఫ్,కోర్టు సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో వినాయకుడి గుడి నిర్మాణం



**వింజమూరు,నవంబర్9,ప్రభాతవార్త :** వింజమూరులోని ప్రసన్నానగర్‌లో వెలసియున్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో కెజివిఆర్‌ఎస్ ట్రస్ట్ ఫౌండర్ సభ్యులు కొ ండా గరుడయ్య - కనకమ్మ , కొండా చలమయ్య-చెంచమ్మ వారసులు కొండా వెంకటేశ్వర్లు- వీరకుమారి, కొండా వెంకటప్రసాద్-ఉషాపద్మ, కొండా రమణాజీ,కొండాశ్రీనివాసులు,వాసవి, సుభద్రాదేవి కుటుంబ సభ్యులు ఆలయ ప్రాంగణంలో అత్యంత సుందరంగా వినాయకుని గుడి నిర్మాణం చేపట్టారు. ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల ఆశీస్సులతో దైవకార్యక్రమాలను నిర్వహిస్తుంటామన్నారు. హిందూమతం, హిందూ సాంప్రదాయాలు ప్రపంచదేశాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. వింజమూరులో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణంలో నిర్వాహకులు ఎంతో అకుంఠిత దీక్షతో పెద్ద ఎత్తున ఆలయాన్ని నిర్మించడం, దాతల సహకారంతో ప్రతి ఏటా ఆలయ అభివృద్ధికి కావాల్సిన అన్నింటిని ఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి తమ కుటుంబ సభ్యులు తోడ్పాటును అ ందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో కొండా వెంకటేశ్వర్లు , వసంతస్వామి, స్థానిక నేతలు పాల్గొన్నారు.